సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



'వెరిట్'తో చెక్

ఎన్నికల తరుణంలో మద్యం అక్రమ సరఫరాను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ 'వెరిట్' పేరుతో యాప్‌ను తీసుకొచ్చింది.

- IIలో ▸



బాలుడి మృతిపై విచారణ

బాల్కొండలో చికిత్సకు డబ్బుల్లేక మృతి చెందిన బాలుడి ఘటనపై అర్మూర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నసీమా సుల్తానా విచారణ చేపట్టారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /21.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి చలితీవ్రత పెరుగుతుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు అమిత్‌షా రాక



పెర్కిట్(ఆర్మూర్) : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారం ఆర్మూర్‌కు రానున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సకల జనుల విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటెల కూడా సభకు రానున్నారు.

రేపు బోధన్‌కు రాహుల్‌గాంధీ..



బోధన్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 25న ఉదయ 11.30 గంటలకు బోధన్‌లో భారీ బహిరంగ సభకు రాహుల్‌గాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రానున్నారు. పట్టణ శివారులో నర్సాపూర్ క్రాసింగ్ వద్ద సభ నిర్వహణకు స్థలాన్ని గురువారం సాయంత్రం సుదర్శన్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు పరిశీలించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్ర 4 గంటలకు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సభకు యూపీ రాజ్యసభ సభ్యుడు ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గడీ హాజరుకానున్నారు.

'ఓట్ ఫ్రం హోం'లో గోప్యత పాటిస్తున్నాం



సుభాష్‌నగర్ : జిల్లాలోని అర్హులుగా గుర్తించిన వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్ల నుంచి 'ఓట్ ఫ్రంహోం'లో భాగంగా ఓట్లు స్వీకరిస్తున్నామని ఈ ఓటింగ్‌ను గోప్యంగా ఉంచేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. గురువారం ఇంటి నుంచి ఓటు స్వీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటిదాకా సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు 2,418 మంది ఇంటినుంచి ఓటేసేందుకు దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 1,058 మంది ఓటేశారన్నారు. 24,25 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఓటును స్వీకరిస్తున్నారన్నారు.



ఆర్మూర్ పట్టణంలోని ఒకే ఇంట్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఐదుగురు



సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



నగరంలో జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ అభ్యర్థి కులాచారి దినేశ్, జిల్లాధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య

కుటుంబ పాలనకు చరమగీతం

అమరవీరుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. జాతీయ రహదారులను ప్రధాని మోదీ మంజూరు చేస్తే రాష్ట్రంలో కేసీఆర్ ఆపుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ చేపడుతామన్నారు.

- 30 తర్వాత కేసీఆర్ ఫాంహౌజ్‌కే పరిమితం !
- కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడం లేదు
- కేసీఆర్ అవినీతిపై విచారణ చేపడతాం
- వరి క్వింటాలుకు రూ.3,100 చెల్లిస్తాం
- సకల జనుల విజయ సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా

సుభాష్‌నగర్ : నవంబర్ 30 తర్వాత సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు ఫాంహౌజ్‌కే పరిమితం చేస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గురువారం నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి సకల జనుల సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ నడ్డా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనను డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంగా మార్చారన్నారు.

■ అమరవీరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని, వారి త్యాగాలపై ఏర్పడిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగు పడిందని నడ్డా ఆరోపించారు. ప్రధాని మోదీ గ్యారెంటీ పథకాలపై ప్రజలు నమ్మకం ఏర్పర్చుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

జంగ్ తెలంగాణ

■ బీజేపీ అధికారంలోకి వస్తే డీజిల్, పెట్రోల్‌పై వ్యాట్ తగ్గిస్తామని, తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి, అట్టడుగు వర్గాల ప్రజలు, మహిళలకు ప్రధాని మోదీ అండగా ఉంటారన్నారు. ఒక వర్గానికి రిజర్వేషన్లు 4 నుంచి 12 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ వర్గం రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు ఇస్తామన్నారు.

పదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఆరు నెలల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాతీయ రహదారులను ప్రధాని మోదీ మంజూరు చేస్తే రాష్ట్రంలో కేసీఆర్ ఆపుతున్నారని విమర్శించారు. రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందిస్తామని, వరికి క్వింటాలుకు రూ.3100 చెల్లిస్తామన్నారు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తామని, పెళ్లి కాని ఆడ పిల్లలకు రూ.2లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ కమీషన్ల వల్లే రాష్ట్రం ఆర్థికంగా వెనకపడి పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ చేపడుతామన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు రాష్ట్రంలో ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ఎమ్మెల్యే జీతం పేదల చదువుకు వెచ్చిస్తా..

- బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత వచ్చే జీతం పేద విద్యార్థుల చదువు కోసం వెచ్చిస్తానని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. ఇందూరు నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కమీషన్లు, కబ్జాలు, అవినీతి రహిత పాలనను అందిస్తానన్నారు. నగరాన్ని రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థికి శ్వేతపత్రం విడుదల చేయాలని పలుమార్లు సవాల్ విసిరినా పట్టించుకోలేదన్నారు. బొడ్డెమ్మ చెరువు అభివృద్ధికి అంచనా వ్యయాన్ని రూ.4 కోట్ల నుంచి రూ.28 కోట్లకు పెంచారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ ఎవరి దూతనో ప్రజలకు తెలుసన్నారు. నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకొస్తానని, పీఎం ఆవాస్ యోజన ద్వారా డబుల్ ఇళ్లు నిర్మిస్తామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఏనాడూ బస్తీల్లో పేదల కష్టాలను చూసిన రోజులు లేవన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కమలం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రూరల్ అభ్యర్థి దినేశ్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ప్రసంగించారు.

అందువల్ల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో అర్బన్‌లో ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్‌లో దినేశ్ కులాచారికి ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటరమణి, కల్లెం బాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, నాయకులు, కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, వెంకటేష్, న్యాలం రాజు, గోపిడి స్రవంతి రెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, కిషన్ నాయక్, లింగంపల్లి లింగం, బీఆర్ శివప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

బోధన్‌లో నా గెలుపు ఖాయం

- బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల మాటలు నమ్మొద్దు
- బోధన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి



తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటే అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గంలో ప్రత్యర్థుల నుంచి తనకు పోటీయే లేదని.. తన గెలుపు ఖాయమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సుదర్శన్ రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.. - బోధన్

☛ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది..?

■ నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి ఒక్క హామీ వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. గ్రామాల్లో, పట్టణంలో మున్సిపల్ వార్డుల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించి ప్రచారం చేస్తున్నాం.

☛ ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది..?

■ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తమకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఏ ఊరికి వెళ్లినా ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. నేను మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి, రాష్ట్ర మంత్రి హోదాలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలే గుర్తుచేస్తున్నారు.

☛ ప్రజలు మీముందుకు తీసుకొస్తున్న ప్రధాన సమస్యలేంటి..?

■ నిరుద్యోగులు ఉపాధి కోసం ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలివ్వలేదు. కొత్త పింఛన్లు లేవు. రేషన్‌కార్డుల్లేవు. స్కూళ్లలో సరైన సౌకర్యాల్లేవు. మధ్యతరగతి విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వలేదు. ఇలా అనేక సమస్యలు మొరపెట్టుకుంటున్నారు.

☛ మీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు..?

■ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో మెడికల్ కాలేజ్, తెలంగాణ యూనివర్సిటీతో పాటు అనేక మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం. గోదావరి, మంజీర నదులపై అలీసాగర్, గుత్ప, సాలూర ఎత్తిపోతల పథకాలు నిర్మించి నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చాం. కాలువల్లో నీళ్లుండడంతో రైతులు రెండు పంటలు సాగు చేస్తున్నారు. అలీసాగర్ రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంచి బ్యాక్ వాటర్‌ను బోధన్ బెల్లాల్ చెరువుకు మళ్లించి పట్టణ ప్రజలకు తాగునీరిచ్చాం బోధన్–నిజామాబాద్ ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టి, రవాణ సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చాం. బాసరలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేశాం.

☛ పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై మీ అభిప్రాయం?

■ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనతో ఎలాంటి లక్ష్యాలు నెరవేరలేదు. నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయి. రాష్ట్రం అధోగతి పాలైంది. ప్రజలు

☛ ఉచిత కరెంట్ విషయంలో..?

కాంగ్రెస్‌కు అధికారమిస్తే వ్యవసాయానికి 3 గంటల కరెంటే ఇస్తుందంటూ బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలోనే అనేక కరెంట్ ప్రాజెక్టులను నిర్మించింది. రైతులకు మొదట 9 గంటల ఉచిత కరెంట్ కాంగ్రెస్సే ఇచ్చిన విషయం రైతులు గుర్తించాలి. రైతులకు మరింత ఆర్థికసాయం పెంచి అమలు చేస్తాం.

☛ ప్రజలకు కాంగ్రెస్ ఇస్తున్న హామీలేమిటి.?

■ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలు, ఐదు డిక్లరేషన్లు (రైతు,యూత్, బీసీ,ఎస్సీఎస్టీ, మైనార్టీ) అమలు చేస్తాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం.

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. నడుస్తున్న నిజాంసాగర్‌ను మూసేశారు. గ్రామాల్లో ఎమ్మెల్యే అనుచరుల అరాచకాలు పెరిగిపోయాయి. ప్రశ్నించే ప్రజలపై పోలీసు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఆశించిన రీతిలో లేదు. కొత్తగా ఏమీ జరగలేదు.

☛ ఆఖరుగా మీరు ప్రజలకు ఏమి చెబుతారు?

■ ఎన్నికల ద్వారా ఒక మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అస్త్రం ప్రజల చేతుల్లో ఉంది. ఆలోచించి సరైన నాయకుడికే ప్రజలు ఓటెయ్యాలి. ప్రక్రియలో ఓటు ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అస్త్రం ప్రజల చేతిలో ఉంటుంది.. ఆలోచించి ప్రజలకు మేలు చేసే నాయకుడికే ఓటెయ్యాలి. నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను.

☛ నిజాంషుగర్స్ సమస్యకు పరిష్కారం..?

■ మూతపడిన నిజాంషుగర్స్ తెరిపించి నడిపించాలంటే ముఖ్యంగా ముడిసరుకు చెరుకు అవసరం. రైతులు చెరుకు పంట సాగుకు ముందుకొచ్చి ఫ్యాక్టరీ తెరిపించాలని కోరితే ఖచ్చితంగా పునఃప్రారంభిస్తాం. 75 నుంచి 80 శాతం ప్రజలు కాంగ్రెస్ రావాలని కోరుకుంటున్నారు.

యువతదే నిర్ణయాధికారం..

- స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటెయ్యాలి
- లేకపోతే పనికిరాని నాయకులు అందలమెక్కుతారు
- సానుకూల దృక్పథంతో ఉన్న బీఆర్ఎస్‌కే మద్దతివ్వండి
- కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్

నిజామాబాద్‌నాగారం : ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని ఓటు వేయకపోతే పనికిరాని వాళ్లు అధికారంలోకి వస్తారని, సానుకూల దృక్పథంతో ఉన్న కారు గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నగరంలోని వర్నీరోడ్‌లోని జనార్ధన్ గార్డెన్‌లో కొత్తగా ఓటు హక్కు పొందిన కళాశాల విద్యార్థినులతో ఆమె సంభాషించారు. తన తల్లిదండ్రులతో కలిసి మొదటిసారి చింతమడకలో ఓటు వేసిన అనుభవాన్ని కవిత గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తమకు నచ్చిన వ్యక్తికి ఓటేసే స్వేచ్ఛ అందరికీ ఉందన్నారు. ప్రతిరోజూ వార్తాపత్రికలను చదవాలని, సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. భారతసైన్యం ప్రతి కూల వాతావరణాన్ని తట్టుకుని దేశానికి రక్షణ కల్పిస్తుంటే కనీసం మనం లైన్‌లో నిలబడి ఓటేయలేమా అని ప్రశ్నించారు. సినిమాల్లోలాగా రాజకీయనాయకులు, పోలీసులు విలన్లు కారన్నారు.

కుటుంబ మద్దతుతోనే రాజకీయాల్లోకి..

రాజకీయాల్లోకి వచ్చే యువతీయువకులకు ఏం సందేశమిస్తాయని ఓ యువతి అడిగిన ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ.. రాజకీయాల్లోకి వచ్చాక కాబట్టి కష్టపడి ప్రజల కోసం పనిచేయాలన్నారు. కుటుంబ సభ్యుల మద్దతు లేకుండా మహిళలు రాజకీయాల్లోకి రావొద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటేయాలని ఒక విద్యార్థిని ప్రశ్నించగా.. ''బీఆర్ఎస్ పార్టీ ఓ అద్భుతమ ని, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. కాబట్టి బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటేయాలి'' అని కవిత బదులిచ్చారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రతీ నియోజకవర్గంలో అగ్రవర్ణాల పేదల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారన్నారు. తొలిసారి ఓటేసిన అనుభవాన్ని చెప్పాలని ఓ విద్యార్థి కోరగా మొదటి నుంచి నా తండ్రికే ఓటు వేశానని, చింతమడకలో తొలిసారి తన తల్లిదండ్రులతో కలిసి ఓటేసిన అనుభవాన్ని మరిచిపోలేనన్నారు. అమెరికాలో తాను చదువుకున్న రోజుల్లో అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కావాలని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. దీనిపై చర్చ జరిగితేనే వ్యవస్థలోనూ ఆలోచన వస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

క్లుప్తంగా

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఇందల్వాయి: పోలింగ్‌ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సాధారణ ఎన్నికల పరిశీలకుడు గౌతమ్‌ సింగ్‌ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామంలోని పోలింగ్‌ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్‌ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టాయిలెట్స్‌, తాగునీరు, ర్యాంపులు, విద్యుత్‌ సౌకర్యం వంటివి సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్‌ వెంకట్‌రావు, సిబ్బంది ఉన్నారు.

మూడు పార్టీల నేతలపై కేసు నమోదు

ఎడపల్లి: మండలంలోని సాటాపూర్‌ గేట్‌ వద్ద పండరీపూర్‌ టీ హోటల్లో మూడుపార్టీలకు చెందినవారిపై కేసులు నమోదు చేసినట్లు సీపీ కల్మేశ్వర్‌ గురువారం తెలిపారు. బుధవారం మూడు వర్గాల మధ్య జరిగిన గలాటపై చేసుకొన్న క్రమంలో ఒకరికి గాయలైనట్లు పేర్కొన్నారు. పోలీసులు ఎంతచెప్పినా వినకపోవడంతో లాఠీచార్జి చేయగా మూడు వర్గాలపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అపరాధ రుసుముతో 6 వరకు గడువు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ కళాశాలలో డిసెంబర్‌6 వరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్‌ రాంమోహన్‌రెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్‌ కోరారు. డిసెంబరులో నిర్వహించే 1వ సెమిస్టర్‌ (రెగ్యులర్‌), 1 నుంచి 6 సెమిస్టర్ల (బ్యాక్‌ లాగ్‌) బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ పరీక్షల ఫీజు చెల్లింపు డిసెంబర్‌ 2 వరకు, రూ. వంద అపరాధ రుసుముతో డిసెంబర్‌ 4, రూ. 200 అపరాధ రుసుంతో 6లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ https://gdets.cgg.gov.in/ nizamabad.edu నుం సందర్శించాలని కోరారు.

సాటాపూర్‌ ఘటనపై ఫిర్యాదు



ఎడపల్లి: సాటాపూర్‌ ఘటనపై ఎలక్షన్‌ అబ్జర్వర్‌ రితురాజ్‌ రవికి కాంగ్రెస్‌ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎడపల్లి కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌తోపాటు కార్యకర్తలపై ఎమ్మెల్యే షకీల్‌ అనుచరులతో దాడి చేయించడం సరైంది కాదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్‌, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్‌ వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పులి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. జైతాపూర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే షకీల్‌ నన్ను చూసి కోపంతో రివాల్వర్‌ రూపంలో చేయిని చూపిస్తూ చంపుతా అని బెదిరించినట్లు తెలిపారు. తర్వాత బూత్‌ ఏజెంట్ల విషయమై తమ కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో సాటపూర్‌ గేట్‌ వద్ద చర్చిస్తుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేయించినట్లు చెప్పారు. దాడికి సంబంధించిన వీడియోను సీడీ రూపంలో వినతిపత్రంతో పాటు ఎన్నికల అబ్జర్వర్‌కు అందజేసినట్లు తెలిపారు. పోలీసులు అక్కడ లేని కాంగ్రెస్‌ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'వెరిట్‌'తో చెక్‌

- పొరుగు రాష్ట్రాల, నకిలీ మద్యంపై ఎక్సైజ్‌ నిఘా
- అందుబాటులోకి ప్రత్యేక యాప్‌, టోల్‌ ఫ్రీ నంబర్‌

ఖలీల్‌వాడి: ఎన్నికల వాతావరణం వేడెక్కిన తరుణంలో మద్యం ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ఎక్సైజ్‌ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకువచ్చే మద్యంతోపాటు నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేకంగా 'వెరిట్‌' యాప్‌ను తీసుకొచ్చారు. సీసాపై ఉన్న బార్‌కోడ్‌ను ప్రత్యేక యాప్‌ ద్వారా స్కాన్‌ చేసి మద్యం నాణ్యతతోపాటు పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇప్పటికే పెద్ద ఎత్తున గ్రామాల వారీగా మద్యం నిల్వ చేశారనే ఆరోపణలున్నాయి. అభ్యర్థిత్వాలు ఖరారుకాగానే మద్యం వ్యాపారులు వారి వద్దకు వెళ్లి మద్యం సరఫరా చేస్తామని ఆర్డర్లు తీసుకున్నట్లు సమాచారం. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు అక్కడి నుంచి జిల్లాకు మద్యంను తీసుకువస్తున్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మద్యం వ్యాపారులకు రూ.కోట్ల విలువైన ఆర్డర్లు ఇస్తూ అడ్వాన్సులు చెల్లిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు కొత్త లైసెన్స్‌ దక్కని కొందరు కల్తీ మద్యం పారించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉందనే ప్రచారం ఉంది.

యాప్‌ పనిచేస్తుందిలా..

'వెరిట్‌' యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్‌ చేసే సమయంలో



వెరిట్‌ యాప్‌ ముఖచిత్రం

అందులో రాష్ట్రం పేరుతో నమోదు చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్‌ ద్వారా సీసాపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్‌ చేస్తే అది ఎక్కడ తయారైంది తెలుస్తుంది. తయారీ కోడ్‌, తయారీ తేదీ, డిపో లొకేషన్‌, అమ్మకం జరిగిన ప్రాంతం, ధర తదితర వివరాలను తెలుసుకోవచ్చు. వివరాలు రాకపోయిన, బార్‌కోడ్‌ లేకపోయినా ఆ సీసాను అనుమానించవచ్చు.

టోల్‌ఫ్రీ నంబర్‌

మద్యం అక్రమరవాణా, నిల్వ తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ ఫ్రీ నంబర్‌ 18004252523ను అందుబాటులో ఉంచారు. హైదరాబాద్‌లోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయం కేంద్రంగా పని చేస్తుంది. మనం ఫోన్‌ చేయగానే ఎక్కడ ఉన్నది సమాచారం నేరుగా అధికారులకు వెళ్తుంది. ఫిర్యాదు అందిన వెంటనే దాడులు చేసి చర్యలు తీసుకుంటారు. జిల్లా ఎక్సైజ్‌ కార్యాలయంలో 08462 237601 నంబర్‌ను జిల్లా అధికారులు అందుబాటులో ఉంచారు.

చర్యలు తీసుకుంటాం

ఎక్కడైనా మద్యం నిల్వ చేస్తే, ఆ సమాచారాన్ని టోల్‌ ఫ్రీ నంబర్‌ లేదా జిల్లా ఎక్సైజ్‌ కార్యాలయం ఫోన్‌ నంబర్‌కు సమాచారం అందించాలి. అక్రమ, నకిలీ మద్యం సరఫరా చేసేవారిపై చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్‌శాఖ వెరిట్‌ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కల్తీ మద్యం నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

– మల్లారెడ్డి, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌

నేతల అడ్డా.. తాడ్వాయి గడ్డ

- దేమె, ఎర్రపహాడ్‌ నుంచే పలువురు అభ్యర్థులు
- నాలుగుసార్లు గెలుపొందిన రవీందర్‌రెడ్డి



ఏనుగు రవీందర్‌రెడ్డి | మదన్‌ మోహన్‌రావు | కాటిపల్లి వెంకటరమణారెడ్డి

జంగ్‌ తెలంగాణ

ఎల్లారెడ్డి: ఉమ్మడి జిల్లా రాజకీయ పటంలో ఏ ప్రాంతానికి దక్కని స్థానం తాడ్వాయికి ఉంది. ఈ మండలం నుంచే అధిక సంఖ్యలో ఎమ్మెల్యే పదవి కోసం పోటీ పడ్డ నాయకులే ఎక్కువ మంది ఉన్నారు. ఎన్నికల్లో గెలిచి ప్రజా సమస్యలను పరిష్కరించాలనే తపన తాడ్వాయి నాయకుల నుంచే పుట్టిందని చెప్పవచ్చు. దీంతో మండలం నేతల అడ్డా.. తాడ్వాయి గడ్డగా మారింది. ఒకప్పుడు నియోజకవర్గంలో ప్రముఖుడైన కాటిపల్లి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైల కృష్టారెడ్డి, మర్రి రాంరెడ్డి, రాజకీయాలపై ఆసక్తి ఉన్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, నాటి టీడీపీ నాయకుడు చుక్క లక్ష్మాగౌడ్‌ లాంటి రాజకీయ నాయకులందరి సొంత మండలం తాడ్వాయి. వీరందరూ ఎమ్మెల్యే పదవికీ పోటీ చేసిన అభ్యర్థులే..

దేమె నుంచి మొదలు..

ఒకప్పుడు బాలాగౌడ్‌, కిషన్‌రెడ్డిలపై ఎమ్మెల్యే ఎలక్షన్‌లలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కాటిపల్లి రాజిరెడ్డి (దేమె) నుంచి మొదలుపెడితే నేటి ఎల్లారెడ్డి కాంగ్రెస్‌ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు వరకు పైన చెప్పిన నాయకులందరి కేరాఫ్‌ అడ్రస్‌ తాడ్వాయి మండలమే. వీరిలో ఏనుగు రవీందర్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా మిగితా నాయకులందరూ ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం కోసం పోటీ పడ్డవారే. మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డిది మండలంలోని ఎర్రపహాడ్‌ స్వగ్రామం కాగా, బీజేపీ నేత బాణాల లక్ష్మారెడ్డి స్వగ్రామం ఎండ్రియాల్‌, 2009లో కామారెడ్డి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌ సీపీ నుంచి పోటీ చేసి ప్రస్తుతం పలు పార్టీల్లో ఎమ్మెల్యే టికెట్‌ కోసం ప్రయత్నిస్తున్న పైల కృష్టారెడ్డిది కూడా ఎర్రాపహాడ్‌ గ్రామం. 2009 ఎన్నికలలో లోక్‌ సత్తా పార్టీ నుంచి పోటీ చేసిన మర్రి రాంరెడ్డిది మండలంలోని కనకల్‌ గ్రామం. ఇక మండలంలోని దేవాయిపల్లికి చెందిన పైడి ఎల్లారెడ్డి నాటి టీడీపీ హయాం నుంచి ఎమ్మెల్యే టికెట్‌ ఆశిస్తున్నారు. కాటిపల్లి రాజిరెడ్డి కుమారుడు కాటిపల్లి రమణారెడ్డిది మండలంలోని దేమె గ్రామం. ఒకప్పుడు టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్‌ కోసం పోటీ చేసిన తూనికలు కొలతల రిటైర్డ్‌ అధికారి చుక్క లక్ష్మాగౌడ్‌ది దేమె గ్రామం. నేడు కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీచేస్తున్న మదన్‌మోహన్‌రావు కూడా తాడ్వాయి మండలంతో తనకు అనుబంధం ఉందని అంటున్నారు. తన తండ్రి రాజేశ్వర రావు ఎర్రాపహాడ్‌లో టీచర్‌గా పనిచేశారని తన ప్రాథమిక విద్య ఎర్రాపహాడ్‌లోనే కొనసాగిందని చెప్పారు. ఇలా ఎల్లారెడ్డి రాజకీయాలను మలుపు తిప్పుతున్న నేటి రాజకీయ ముఖ్య నాయకులందరూ తాడ్వాయి మండలానికి చెందిన వారే కావడం విశేషం. గెలుపు ఓటముల సంగతి పక్కన పెడితే తాడ్వాయి గడ్డ.. నేతల అడ్డా అని ఇక్కడి చోటా మోటా నాయకులు అంటుంటారు.

అభివృద్ధి చేసి ఓట్లడుగుతున్నా..

- బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బీర్కూర్‌లో మాట్లాడుతున్న పోచారం



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

బాన్సువాడ: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రూ.11 వేల కోట్లతో అభివృద్ధి చేశానని ఎన్నికల్లో తనను ఆదరించాలని బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. బీర్కూర్‌ మండలంలోని దామరంచ, రైతునగర్‌, అన్నారం, సంబాపూర్‌, బరంగెడ్డి, బైరాపూర్‌, బీర్కూర్‌ మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు, రైతు బీమా, డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్‌, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌, కేసీఆర్‌ కిట్‌ వంటి సంక్షేమ పథకాలు లేవని తెలంగాణ వచ్చాకే ఈ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. మంజీర నదిపై చెక్‌డ్యాంలను నిర్మించామని, భవిష్యత్‌లో కరెంటు కొరత లేకుండా ఉండేందుకు కొల్లూర్‌లో రూ.90 కోట్లతో 220కేవీ సబ్‌స్టేషన్‌, కోటగిరిలో రూ.20 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బీర్కూర్‌లో వివిధ కుల సంఘాల సభ్యులు పోచారంకు మద్దతు తెలిపారు. ప్రచారాల్లో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్‌, డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ జెట్పీటీసీ ద్రోణవల్లి సతీష్‌, ఎంపీపీ రఘు, వైస్‌ ఎంపీపీ కాశీరాం, జెట్పీటీసీ స్వరూప, ఎంపీటీసీ సందీప్‌, సర్పంచులు కృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, సాయిలు, అవారి గంగారాం, సాయిలు, శశికాంత్‌, దుంపల రాజు, ఆరీఫ్‌, మన్నన్‌, పోగు నారాయణ, పర్తు నారాయణ, యాట వీరేశం తదితరులు పాల్గొన్నారు.

తెయూ హాస్టల్‌ తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఓల్డ్‌ బాయ్స్‌ హాస్టల్‌ను రిజిస్ట్రార్‌ యాదగిరి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నచ్చే విధంగా వంటలు చేయాలన్నారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్‌ యాదగిరి, చీఫ్‌ వార్డెన్‌ మహేంద్ర ఐలేని, పీఆర్‌ఓ పున్నయ్య భోజనం చేశారు. హాస్టల్‌ కేర్‌ టేకర్‌ దిగంబరచవాన్‌, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



హాస్టల్‌ను తనిఖీచేస్తున్న రిజిస్ట్రార్‌

ఇబ్రహీంపేట్‌లో ఇరువర్గాల ఘర్షణ

బాన్సువాడ రూరల్‌: మండలంలోని ఇబ్రహీంపేట్‌లో గురువారం రాత్రి కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చేరుకున్న కాంగ్రెస్‌ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా బీఆర్‌ఎస్‌ నాయకులు అభ్యంతరం తెలిపారు. అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతున్నారని, అబద్ధపు మాటలు మానుకోవాలని నినాదాలు చేశారు. ఇరుపార్టీల నాయకులు పరస్పరం నినాదాలు చేసుకుని నెట్టుకోవడంతో పోలీసులు ఆందోళన కారులను శాంతింపచేశారు.

క్రైం కార్నర్‌

సౌదీలో రాజఖాన్‌పేట వాసి మృతి

మాచారెడ్డి: బతుకు దెరువు నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లిన ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజఖాన్‌పేట గ్రామానికి చెందిన సుంకోజు నర్సింహచారి (55) ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. ఈ నెల 19న ఛాతిలో నొప్పంటు కుప్పకూలాడు. వెంటనే అక్కడున్న అతని స్నేహితులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి నరసింహచారి మృత దేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నరసింహచారి(ఫైల్‌)

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

రుద్రూర్‌: కోటగిరి మండలం వల్లాభపూర్‌ గ్రామానికి చెందిన నాచుపల్లి చిరంజీవి (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోదరిని పరామర్శించి వస్తానని చెప్పి బుధవారం వెళ్లిన చిరంజీవి ఇంటికి చేరుకోలేదు. పోతంగల్‌ మండలం టాక్లీ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందినట్లు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి కాళ్లు భూమికి తగులుతున్నాయని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన భర్తను హత్య చేసి ఉంటారని భార్య లక్ష్మి అనుమానం వ్యక్తం చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రామారెడ్డి: భార్య కాపురానికి రావడంలేదనే మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ గురువారం తెలిపారు. తాడ్వాయి మండలం సంతాయిపేటకు చెందిన మ్యాదరి భాస్కర్‌ (33) అన్నారం గ్రామానికి చెందిన అనితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి మధ్య గొడవలు కావడంతో అనిత అక్టోబర్‌ 30న తల్లిగారింటికి వెళ్లింది. కాపురానికి రావాలని పలుమార్లు భాస్కర్‌ విన్నవించినా రాకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి విజయకు భాస్కర్‌ తెలుపగా వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో..

రామారెడ్డి: వడ్లకుప్ప వద్ద జరిగిన గొడవలో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ గురువారం తెలిపారు. రెడ్డిపేటకు చెందిన ఎంబరి లింబాద్రి (29) బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వడ్లకుప్ప వద్ద గొడవ జరిగింది. గొడవను మనసులో పెట్టుకొని మనస్తాపానికి గురైన లింబాద్రి గురువారం తాను ఉరేసుకొని చనిపోతున్నట్లు భార్యకు ఫోన్‌ చేసి తెలిపాడు. వెంటనే భార్య లావణ్య గ్రామస్తులతో కలిసి అక్కడి వెళ్లగా అప్పటికే లింబాద్రి మృతి చెందాడు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



నస్రుల్లాబాద్‌: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో పలువురు వ్యక్తుల నుంచి రూ.1,58,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటన స్థలిలో బాధితులు

నస్రుల్లాబాద్‌: మండల కేంద్రంలోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువ మూల మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వర్ని నుంచి బాన్సువాడ వైపు బైక్‌పై వెళ్తున్న సాకలి తుకారాం, భూలక్ష్మిలను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ ఢీకొన్నది. ఈ ఘటనలో వారికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిజాంసాగర్‌/ బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ మండలం పెదవాగు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకల నగేశ్‌ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో మహేందర్‌రెడ్డి తెలిపారు. మహమ్మద్‌నగర్‌ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన నగేష్‌ బాన్సువాడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా ప్రైవేట్‌ అంబులెన్స్‌ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.



నగేశ్‌ (ఫైల్‌)

నడ్డాకు ఘన స్వాగతం





సభలో జాతీయ అధ్యక్షుడు నడ్డాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధన్‌పాల్‌ సూర్యనారాయణ, కులాచారి దినేశ్‌

సుభాష్‌నగర్‌: నగరంలోని జీజీ కళాశాల మైదానంలో నిర్వహించిన సకల జనుల సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ ప్రకాశ్‌ నడ్డా సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. అర్బన్‌, రూరల్‌ బీఆర్‌ఎస్‌, ఇతర పార్టీల నాయకులు నడ్డా సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ కౌన్సిలర్‌ అంబదాస్‌ రావు, ఇందల్వాయి కిషన్‌, చెరుకు లక్ష్మణ్‌ గౌడ్‌, గంగాధర్‌, బింగి మోహన్‌, రాజశేఖర్‌, తిరుపతిరెడ్డికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ అర్బన్‌, రూరల్‌ అభ్యర్థులు నడ్డాను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.



నడ్డాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బస్వా లక్ష్మీనర్సయ్య



జేపీ నడ్డాతో కార్పొరేటర్లు

మిషన్‌ కాకతీయతో గంగపుత్రలకు లబ్ధి

ఎమ్మెల్సీ కవిత

ఆర్మూర్‌: మిషన్‌ కాకతీయ పథకంతో గంగపుత్రులు లాభపడ్డారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద గురువారం నిర్వహించిన గంగపుత్రల ఆత్మీయ సమ్మేళనానికి కవిత హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గంగపుత్రులను గుర్తించింది సీఎం కేసీఆరే అని అన్నారు. ఎక్కడ చూసినా చెరువులు నిండు కుండల్లా ఉన్నాయని దీంతో చేపల పెంపకం పెరిగిందన్నారు. తెలంగాణలో ఉన్న గంగపుత్రులే దేశానికి ఆదర్శంగా ఉన్నారని ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమ్మేళనంలో జడ్పీచైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు, గంగపుత్ర సంఘం సభ్యులు బట్టు నరేందర్‌, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బాలుడి మృతిపై విచారణ

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద మృతి చెందిన బాలుడు చందు(5) ఘటనపై ఆర్మూర్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి నసీమా సుల్తానా గు రువారం విచారణ చేపట్టారు. ఇత్వార్‌పేట్‌లో ఉన్న ఇటుక బట్టీలో ఏపీలోని నెల్లూర్‌ జిల్లాకు చెందిన నరేశ్‌ కూలీగా పనిచేస్తున్నాడు. అతని కుమారుడు చందుకి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై జడ్జి ఇటుక బట్టి వద్ద విచారణ చేపట్టారు. బట్టి యజమాని సకాలంలో డబ్బులు ఇవ్వలేదనే ఆరోపణలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు సరైన వసతి లేక పోవడంపై మండిపడ్డా రు. ప్రతి వారం లేబర్‌ కమిషనర్‌ పర్యవేక్షించాలన్నారు. మైనింగ్‌ అధికారులు సరైన చర్యలు తీసుకో వాలన్నారు. మృతుడి కుటుంబానికి తన వంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశా రు. జడ్జి వెంట తహసీల్దార్‌ శ్రీధర్‌ ఉన్నారు.



విచారణ చేపడుతున్న నసీమా సుల్తానా

పలు గ్రామాల్లో మద్యం పట్టివేత

- మద్యం బాటిళ్లు, కారు సీజ్‌
- సింగిల్‌ విండో చైర్మన్‌పై కేసు నమోదు



భిక్కనూరులో స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

భిక్కనూరు: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సింగిల్‌ విండో చైర్మన్‌ గంగల్ల భూమయ్య కారును తనిఖీ చేయగా అందులో 864 మద్యం క్వార్టర్‌ సీసాలు లభ్యమైనట్లు చెప్పారు. మద్యం సీసాలను పట్టుకున్న సందర్భంలో విండో చైర్మన్‌, బీజేపీ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కారు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్‌ చేశారు. విండో చైర్మన్‌ భూమయ్యతో పాటు సిద్దరామేశ్వర వైన్‌షాప్‌ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాటాపూర్‌లో..

రెంజల్‌: సాటాపూర్‌ గ్రామ శివారులో బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న తెలిపారు. ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్‌ జగన్‌, కానిస్టేబుళ్ల లక్ష్మణ్‌, మంజుల ఉన్నారు.

జంగంపల్లిలో

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. గ్రామానికి చెందిన సంతోష్‌, రామస్వామి వద్ద మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.